క్లుప్తంగా

గ్రూప్- 1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గ్రూప్- 1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం గ్రూప్ 1 పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతీ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సీసీ కెమెరాల నిఘా ఏ ర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్డీవో రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్: సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్‌ను శుక్రవారం సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారయ్యే లోగా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సీపీవో రవీందర్ తదితరులు ఉన్నారు.

12న ప్రజావేదిక

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12 సోమవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఉపాధిహామీ ఏపీవో గోవర్ధన్ సింగ్ అన్నారు. 01.12.2020 నుంచి 31.03.2023 వరకు మండలంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై 29.05.2023 నుంచి 12.06.2023 వరకు 2వ విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 12న సామాజిక తనిఖీపై ఉన్నతాధికారుల సమక్షంలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. ఉదయం 9గంటల నుంచి ప్రారంభమయ్యే ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధిహామీ కూలీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

12న పోలీసుల ఆధ్వర్యంలో 2.5కే రన్

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 12న కాగజ్‌నగర్‌లో తెలంగాణ 2.5కే రన్ నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ పట్టణ సీఐ బుద్దే స్వామి తెలిపారు. ఉదయం 5 గంటలకు స్థానిక సిర్పూర్ పేపర్ మిల్లు క్రీడామైదానంలో తెలంగాణ రన్‌ను జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్ జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. తెలంగాణ రన్‌ను విజయవంతం చేయడానికి పట్టణంలోని యువకులు, ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జీపీ భవనాలకు నిధులు మంజూరు

దహెగాం: మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బామానగర్, చౌక గ్రామాల్లోని భవన నిర్మాణానికి స్థలాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పెసరికుంట, కమ్మర్‌పల్లి, చౌక, బామానగర్, దిగిడ, కల్వాడ పంచాయతీల్లో ఒక్కో భవన నిర్మాణానికి ఈజీఎస్ కింద రూ.20 లక్షలు మంజూరయ్యాయన్నారు. మంజూరైన పంచాయతీ భవనాలకు స్థలాలు గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ముందస్తు అరెస్టు

రెబ్బెన: సీఎం కేసీఆర్ మంచిర్యాల పర్యటన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని ఏఐటీయూసీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన స్టేషన్‌కు తరలించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి మాట్లాడుతూ కార్మిక సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, శేషు, ఫిట్ కార్యదర్శి రాజేష్ ఉన్నారు.

ఎస్‌టీయూ ఆవిర్భావ వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల హక్కుల కోసం ఎస్‌టీయూ పోరాటం చేస్తుందని ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మానిక్ రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌టీయూ కార్యాలయంలో 76వ ఆవిర్భావం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్‌టీయూ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి తుకారాం, నాయకులు రాజేశ్వర్, అరుణ్, తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెంచికల్‌పేట్: మండలంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా బాలికల విద్యాలయంతో పాటు పలు నూతన భవనాలను శనివారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించనున్నట్లు ఎంపీపీ సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు.

ముగిసిన టీచ్ ఇన్ ఆసిఫాబాద్

- విజయవంతంగా రెండో విడత కార్యక్రమం
- విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి



గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు



విద్యార్థులతో యాక్టివిటీ చేయిస్తున్న వలంటీర్

కెరమెరి: విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు పిరమిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రోత్సాహంతో మే 10న ప్రారంభమైన 'టీచ్ ఇన్ ఆసిఫాబాద్' కార్యక్రమం శుక్రవారం ముగిసింది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, వివిధ సామర్థ్యాలను గుర్తించి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. 2022లో కూడా అప్పటి అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

318 మంది విద్యార్థులు

టీచ్ ఇన్ ఆసిఫాబాద్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కెరమెరి మండలం గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు జైనూర్ మండలం జంగాం ప్రాథమిక పాఠశాల, లింగాపూర్ మండలంలోని లింగాపూర్ ప్రాథమిక పాఠశాల, ఆసిఫాబాద్ మండలంలోని మోవాడ్ ప్రాథమిక పాఠశాలల్లో 318 మంది ప్రాథమికస్థాయి విద్యార్థులు విద్యనభ్యసించారు. ఆయా గ్రామాల్లో ఉన్న గిరిజన, గిరిజనేతర విద్యార్థులకు 9మంది వలంటీర్లతో ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. 30 రోజుల పాటు కొనసాగిన కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాఠశాలలకు హాజరయ్యారు.

ఆడుతూ.. పాడుతూ..

విద్యార్థులకు ఓవైపు వినూత్న అంశాలు నేర్పించడంతో పాటు, ఆటలు ఆడిస్తూ, పాటలు పాడిస్తూ, నృత్యాలు చేస్తూ విద్యాబోధన కొనసాగించారు. ఆయా తరగతుల్లోని విద్యార్థులను వలంటీర్లు, వారి సామర్థ్యాల ఆధారంగా బృందాలుగా విభజించారు. తెలుగు, ఆంగ్లం రాయడంతో పాటు, వర్తమాన, విభజన అంశాలను నేర్పించారు. గణితంలో విద్యార్థుల ప్రతిభ అంచనా వేసి దానికి అనుగుణంగా పాఠాలు బోధించారు. నాయకత్వ లక్షణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రబలుతున్న మూఢనమ్మకాలు, వాటి నిర్మూలన, ప్రజల మధ్య మాట్లాడే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్టేషనరీ, స్పోర్ట్స్ కిట్లు అందించనున్నారు.

ప్రజలకు అవగాహన..

ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలను కూడా భాగస్వాములు చేశారు. ప్రతీరోజు ఉదయం గ్రామంలోకి వెళ్లి గ్రామీణులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న పోకడలు, సమకాలిన అంశాలు, గ్రామాభివృద్ధి, పరిసరాలు, పరిశుభ్రత, విద్యా తదితర రంగాల్లో అవగాహన కల్పించారు. మహిళలకు బేటిపడావ్, బేటి బచావ్, బాలికా విద్యా, ఇంట్లో చేసే వంటలు, డ్రాపవుట్ శాతం తగ్గించడం, ఇళ్లలో ఉండే మహిళల సాధికారాభివృద్ధికి తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు.

అనేక అంశాలపై అవగాహన



విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడంతో పాటు, తెలుగు, ఆంగ్లం, గణితంలో సామర్థ్యాలు పెంచేందుకు ఆటలు, పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా బోధన చేశాం. విద్యార్థులకే కాకుండా గ్రామీణులకు, మహిళలకు కూడా అనేక అంశాలపై అవగాహన కల్పించాం.

- సాయినాథ్, పిరమిడ్ ఫౌండేషన్, జిల్లా ప్రతినిధి

పేదింటి ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి

బెజ్జూర్: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరమని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత బిక్షమయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం మండలంలోని 22 గ్రామపంచాయతీల నుంచి 111 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ కె.శ్రీపాల్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు బాషారత్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ డోకే వెంకన్న, మాజీ వైస్‌చైర్మన్ దందెర ఇస్తారి, మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిడం సకారాం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 115 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం జిల్లా కేంద్రంలో పంపిణీ చేశారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రైతువేదికలో లబ్ధిదారులకు మండల ప్రత్యేక అధికారి తారామణి, తహసీల్దార్ రియాజ్ అలీ, మండల ప్రజాప్రతినిధులు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. సర్పంచ్ తఫీమా పర్వీన్, హుడ్కిలి సర్పంచ్ ప్రభాకర్, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఎంపీటీసీ తుకారాం, ఉపసర్పంచ్ తోట మహేష్, నాయకులు చునార్కర్ ఉమాజీ, ఇఫాత్‌హుస్సేన్ పాల్గొన్నారు.



బెజ్జూర్: చెక్కులు అందజేస్తున్న జెడ్పీటీసీ

తిర్యాణి: కల్యాణ లక్ష్మి చెక్కులను 46 మంది లబ్ధిదారులకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అందజేశారు. జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జగదీశ్, తహసీల్దార్ అనంతరాజు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంత్‌రావు, సర్పంచ్‌లు గోపాల్, కేశవ్ తదితరులు ఉన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సంతోష్ ఫంక్షన్ హాల్‌లో 230 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీ రుణాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, తహసీల్దార్ మునవ్వర్ షరీఫ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేయాలని ధర్నా

రెబ్బెన: బీసీ కులవృత్తులకు అందిస్తున్న రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని గీత కార్మికులకు అందించాలని, ఏజెన్సీ గీతా కార్మికులకు లైసెన్స్‌లను పునరుద్ధరించాలని, వైన్‌షాపుల్లో 50శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మోకుదెబ్బ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో మోకుదెబ్బ నాయకులు చిరంజీవిగౌడ్, సంతోష్ గౌడ్, సతీష్‌గౌడ్, సురేష్‌గౌడ్, సత్యనారాయణ గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, మల్లాగౌడ్, తిరుపతి గౌడ్, కిష్టాగౌడ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు ఆర్థిక సాయం అందజేయాలి

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పద్మశాలీ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని పద్మశాలీ సేవా సంఘం మండల అధ్యక్షుడు మారిన వెంకటేశ్వర్లు అన్నారు. సంఘం రాష్ట్రశాఖ పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. పద్మశాలీ కులస్తులు గుండేటి వీరస్వామి, దోమల పోచయ్య, పోన్న శంకర్, హనుమండ్ల సత్యనారాయణ, చందర్, శ్రీపతి, భీమయ్య, శ్రీకాంత్, విష్ణు విలాస్‌లు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మోకుదెబ్బ నాయకులు

తిర్యాణిలో..

తిర్యాణి: రాష్ట్ర ప్రభుత్వం బీసీలోని పద్మశాలీ, గౌడలకు సైతం రూ.1 లక్ష ఆర్థిక సాయం అందించాలని ఆయా సంఘాల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. నాయకులు హన్మండ్ల శంకర్, అంకం గౌరయ్య తదితరులు ఉన్నారు.

వర్షాధార పంటల సర్వే



రైతులతో మాట్లాడుతున్న ఏఈవో అంజన్న

కౌటాల: గ్రామాల్లో వర్షాధార పంటల గుర్తింపు సర్వే చేస్తున్నామని, రైతులు సహకరించాలని గుండాయిపేట ఏఈవో చౌదరి అంజన్న అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ గ్రామాల్లో గత ఖరీఫ్‌లో రైతులు వర్షాధారంతో సాగు చేసిన పంటల వివరాలను గుర్తిస్తున్నామన్నారు. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం'

కౌటాల: బీఆర్‌ఎస్ హయాంలో సిర్పూర్(టి) నియోజకవర్గం అన్ని రంగాల్లో విఫలమైందని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్ బాబు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక్కడి రైతాంగానికి తీవ్ర నష్టం చేసిందన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీలు కట్టిన రైతులకు ఓఆర్సీ బిల్లులు రూ.లక్షల్లో రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాయకులు బండి రాజేందర్‌గౌడ్, ఎల్ములే మల్లయ్య, ఉమా మహేష్, కుంచాల విజయ్, మధుకర్, చందు తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఆసిఫాబాద్: జిల్లాలోని సామాజిక పరిస్థితులపై పిరమిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే, ఇచ్చిన సూచనలు అభినందనీయమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. నెల రోజులుగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పిరమిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక పరిస్థితులపై చేపట్టిన పరిశీలన పత్రాలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సర్వే బృందంతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పిరమిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సర్వే చేపట్టారని తెలిపారు. సర్వేతో జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల జీవన స్థితిగతులతోపాటు వారి వెనుకబాటుతనానికి గల కారణాలు తెలుస్తున్నాయన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం తీసుకునే భవిష్యత్తు కార్యాచరణలో పిరమిడ్ ఫౌండేషన్ బృందాన్ని భాగస్వాములను చేస్తామని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీల పనితీరుపై కూడా గుణాత్మకమైన పరిశీలన చేశారని కొనియాడారు. వారి పరిశీలన, సూచనలు అభివృద్ధికి దోహదం చేసే విధంగా ఉన్నాయన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సర్వే బృందంతో కలెక్టర్, అధికారులు

ఆర్టీసీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఆర్‌వో సురేందర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో పరిధిలో నూతన విజిలెన్స్ అధికారులకు నియామక పత్రాలు అందజేశారు. సిబ్బంది ఉదయ్‌కుమార్, భారతి, శ్రావణ్, కార్మికులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జూనియ ర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ రవి ఒక ప్రకటనలో తెలిపారు.

తగ్గని ఎండలు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో ఎండలు తగ్గుముఖం పట్టడం లేదు. ఉదయం నుంచే వడగాలులు వీస్తున్నాయి. రాత్రి 9 దాటినా ఉక్కపోత, వేడి తగ్గడం లేదు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం జంబుగాలో పగటి ఉష్ణోగ్రత 45.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, దహెగాం మండలం కుంచవెల్లిలో 45.1 డిగ్రీలుగా నమోదైంది. వాతావరణ శాఖ కాగజ్‌నగర్, దహెగాం మండలాలకు హెచ్చరికలు జారీ చేసింది. కౌటాల, చింతలమానెపల్లి, కెరమెరి, పెంచికల్‌పేట్ మండలాల్లో సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటాయి.

ప్రారంభమైన బీఎస్పీ పాదయాత్ర

బెజ్జూర్: బహుజన రాజ్య సాధన కోసం సిర్పూర్ నియోజకవర్గంలో బీఎస్పీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. శుక్రవారం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బహుజనులను రాజ్యాధికారం దిశగా తీసుకెళ్తామన్నారు. నోటు మీదే -ఓటు మీదే బహుజన రాజ్యం అనే నినాదంతో పాదయాత్ర నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు కొండా రాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్, మండల అధ్యక్షుడు ఆత్రం సాయి, మత్స్యకార సంఘ అధ్యక్షుడు సూర్ల ఇస్తారి, రమేశ్, పోచం, జీవన్, సల్మాన్‌ఖాన్, పాలిట్రిక్స్ పుస్తక రచయిత సురేష్ దుప్తా, శేఖర్, చిత్రు, అర్షద్, రాకేష్, మంగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



పూలమాల వేస్తున్న అర్షద్ హుస్సేన్

'బడీడు పిల్లలు బడిలో ఉండాలి'

కెరమెరి: బడీడు పిల్లలను బడిలో చేర్పాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. బడిబాటలో భాగంగా శుక్రవారం మండలంలోని సుర్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఐదేళ్లు పూర్తయిన పిల్లల జాబితా తయారు చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు విఠల్, రవీందర్, తుల్సిదాస్, అంగన్‌వాడీ కార్యకర్త బొజ్జుబాయి ఉన్నారు.

ఆసిఫాబాద్ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలను బడిలో బడిలో చేర్పించాలని జిల్లా సెక్టోరల్ అధికారి రాథోడ్ సుభాష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఉచిత విద్య, భోజనం, పుస్తకాలు, యూనిఫాంలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 586 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం సుభాష్, వెంకటేశ్వర్లు, ఉమా పాల్గొన్నారు.



సుర్దాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

యువశక్తిని మేల్కొలిపే దిశగా క్విజ్ పోటీలు

వాంకిడి: యువశక్తిని మేల్కొలిపే దిశగా రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాథోడ్ గణేశ్ అన్నారు. మండలంలోని చౌపన్‌గూడ, పిప్పర్‌గొంది, వాంకిడి, పుల్లార గ్రామాల్లో శుక్రవారం క్విజ్ పోటీలపై యువతకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18న క్విజ్ పోటీలు ఉంటాయని, యువత 17 తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 40 బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. నాయకులు రమేశ్, గోవింద తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న రాథోడ్ గణేశ్

జీపీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

సిర్పూర్(టి): గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధి కార్మికులు ఈవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు గణేశ్, భార్గవ్, మారుతి, రాజమల్లు, మాజిత్, ప్రమోద్‌కుమార్, భీమయ్య, హరిచంద్రప్రసాద్, రాజేందర్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు పెంచి, అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న బ్లాక్ డే, బ్లాక్ యూనిఫాంతో నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. 17న జీపు జాతర ప్రారంభించి 10 కిలోమీటర్ల పాదయాత్ర అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు త్రివేణి, వనిత, కృష్ణమాచారి, అరుణ, కృష్ణవేణి, రజిత, జయమండల్, మల్లేశ్వరి, రూప, ఉమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్

కులవృత్తుల అభివృద్ధికి కృషి

ఆసిఫాబాద్: కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామంలో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ఆర్థికాభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, కోఆప్షన్ సభ్యులు బాబా, ఎంపీడీవో గౌరీశంకర్, తహసీల్దార్ షరీఫ్, పశువైద్యాధికారి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్: కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని డీఈవో అశోక్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం భట్‌పల్లి గ్రామ పంచాయతీలోని జీడిచేనులో శుక్రవారం నిర్వహించిన బడిబాట కా ర్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు బడిబయట విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో జి ల్లా పరీక్షల పరిశీలకులు ఉదయ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎంఈవో గడ్డం భిక్షపతి, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, సర్పంచ్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

తిరిగి విధుల్లోకి తొలగించిన ఉద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్ఆర్‌ఓ కాలనీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులు స్వప్న, శ్రీలత, భారతిని విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. కేజీబీవీలో చదువుతున్న విద్యార్థిని ఎన్.ఐశ్వర్య 2022 సెప్టెంబర్ 7న తీవ్రజ్వరంతో బాధపడుతూ మృతిచెందింది. ఎస్‌వో, సీఆర్‌టీ, ఏఎన్‌ఎం విధుల్లో నిర్లక్షంగా వ్యవహరించారని సదరు విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆ ముగ్గురిని విధుల నుంచి తొలగించారు. జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులు భర్తీ చేస్తూ ఈ నెల 8న విద్యాశాఖ కార్యదర్శి దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. తిర్యాణి మండలంలోని మానిక్యపూర్ కేజీబీవీ ఎస్‌వోగా స్వప్నకు, చింతలమానెపల్లిలో సీఆర్‌టీగా శ్రీలత, సిర్పూర్(టి) కేజీబీవీలో ఏఎన్‌ఎంగా భారతికి పోస్టింగ్ ఇచ్చారు.